రైతు కుటుంబాలు ఆర్థికంగా ఎదగాలి

గుమ్మలక్ష్మీపురం: రైతు కుటుంబాలు ఆర్థికంగా ఎదగాలని నాబార్డు జనరల్ మేనేజర్ రవిబాబు ఆకాంక్షించారు. మండలంలోని రాయగడజమ్ము, గొరడ గ్రామాల్లోని రైతులు సావిత్రమ్మ, సుందరమ్మ, లచ్చన్న, బంగార్రాజు వ్యవసాయ క్షేత్రాల్లో నాబార్డు సౌజన్యంతో జట్టు పర్యవేక్షణలో సాగుచేస్తున్న పంటలను ఆయన శుక్రవారం పరిశీలించారు. నిత్యం ఆదాయం వచ్చేలా ఓ ప్రణాళిక ప్రకారం సాగు చేయాలని, వేస్తున్న పంటల వల్ల ఎంతమేర ప్రయోజనమో తెలుసుకోవాలన్నారు. ఆయన వెంట నేషనల్ బ్యాంక్ అధికారి దీప్, జట్టు ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్.ప్రహరాజ్ తదితరులు ఉన్నారు.

ఇంటింటా సంక్షేమ వెలుగులే జగనన్న లక్ష్యం

- వచ్చేనెల నుంచి రూ. 3 వేల పింఛన్
- పాలకొండ ఎమ్మెల్యే కళావతి



కరపత్రాలతో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కళావతి

సీతంపేట: నూతన సంవత్సర కానుకగా జగనన్న పింఛన్ మూడు వేల రూపాయలు కానుందని, ఇంటింటా వెలుగులు నింపడమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే విశ్వసరాయి కళావతి అన్నారు. సీతంపేట గ్రామ సచివాలయం -2 పరిధిలోని వాబ, వాబకాలనీ, తదితర గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు మహిళలు హారతులు ఇచ్చి ఘన స్వాగతం పలికారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. నాలుగున్నరేళ్ల వైఎస్సార్‌సీపీ హయాంలో ఒక్కో కుటుంబానికి సంక్షేమ పథకాల రూపంలో ఎంత లబ్ధి చేకూరినదీ వివరిస్తూ, ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. గ్రామ సచివాలయ వ్యవస్థతో ఇంటి వద్దకే పాలన తీసుకువచ్చిన ఘనత సీఎం జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని చెప్పారు. గ్రామాల్లో రహదారులు, తాగునీరు, ఇతర మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అధిక మొత్తంలో నిధులు మంజూరు చేస్తోందన్నారు. సమస్యలు తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. గిరిజనులకు అటవీహక్కు పత్రాలు అందజేసి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చరిత్ర సృష్టించారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.ఆదినారాయణ, వైస్ ఎంపీపీ కుండంగి సరస్వతి, సర్పంచ్‌లు ఆరిక కళావతి, హిమరక ఆదిలక్ష్మి, తిరుపతిరావు, ఎంపీటీసీ సభ్యులు జి.పగడాలమ్మ, చంద్రశేఖర్, హరిబాబు, పార్టీ నాయకులు ఎస్.రాము, ఎన్.కృష్ణ, ప్రకాష్, పరిపాలనాధికారి మాస, గ్రామ కార్యదర్శులు సుదర్శనరావు, శివ, వెల్ఫేర్ అసిస్టెంట్ నందిని, గ్రామ వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్రా' ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలి..

పాలకొండ రూరల్: క్షేత్రస్థాయిలో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చేపడుతున్న ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని సచివాలయాల పరిధిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని ఎంపీడీఓ డొంక త్రినాథులు అన్నారు. మండల పరిధిలోని 22 సచివాలయాల అడ్మిన్ సెక్రటరీలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఔత్సాహిక క్రీడాకారుల రిజిస్ట్రేషన్ల మేరకు ప్రతి సచివాలయానికీ రెండు జట్లను సిద్ధం చేయాలన్నారు. రోజువారీ నివేదికలను తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. అలాగే ప్రస్తుత సీజన్‌లో ప్రజల ఆరోగ్య స్థితిగతులపై దృష్టి సారించాలని.. ఆర్‌బీకేల ద్వారా అవసరమైతే రైతులకు సహకరించాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

గరుగుబిల్లి: గ్రామీణ ప్రాంతాల్లోని సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఎంపీపీ ఉరిటి రామారావు, జెడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో రైస్‌మిల్లుల వద్ద రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పలువురు సభ్యులు సభ దృష్టికి తీసుకువచ్చారు. ఆర్‌బీకేల ద్వారా మిల్లులకు తరలిన ధాన్యంలో తేమశాతం ఎక్కువగా ఉందని మిల్లు యజమానులు రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. స్పందించిన ఏవో విజయభారతి ఇప్పటికే ధాన్యం కొనుగోలుపై మిల్లర్లకు సలహాలు, సూచనలు చేయడం జరిగిందన్నారు. ఆర్‌టీసీ సమస్యలు పరిష్కరించాలని పలుమార్లు తెలియజేసినప్పటికీ ఆర్‌టీసీ అధికారులు చొరవ చూపకపోవడంపై ఎంపీటీసీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్ క్రాంతి పథం ద్వారా మహిళా సంఘాలకు స్త్రీనిధి, బ్యాంకు లింకేజీ రుణాలు మంజూరు చేయడం జరుగుతుందని ఏపీఎం అప్పలనాయుడు తెలిపారు. ఎంపీపీ, జెడ్పీ వైస్ చైర్మన్ మాట్లాడుతూ భూముల సర్వేలో గుర్తించిన లోపాలను సరిదిద్ది, రైతులకు న్యాయం చేయాలని రెవెన్యూ అధికారులకు తెలిపారు. సమావేశంలో ఎంపీడీవో జి.పైడితల్లి పాల్గొన్నారు.



ఆదర్శప్రాయుడు రామానుజన్



కురుపాం జెడ్పీ ఉన్నత పాఠశాలలో రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



పాలకొండ: ఓని ప్రభుత్వ పాఠశాలలో రామానుజన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

పాలకొండ, కురుపాం నియోజకవర్గాల్లో జాతీయ గణిత దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ పుట్టినరోజున ఏటా ఈ కార్యక్రమం నిర్వహిస్తుండడం గమనార్హం. కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్య అతిథులు తొలుత రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం గణితంలో ఆయన కనబరిచిన ప్రతిభాపాటవాలను కొనియాడారు. విద్యార్థులంతా ఆయనను ఆదర్శంగా తీసుకుని, గణిత మేధావులుగా వెలుగొందాలని ఆకాంక్షించారు. పలుచోట్ల జరిగిన గణిత పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. –సాక్షి నెట్‌వర్క్.

వేగవంతంగా మ్యూజియం పనులు

సీతంపేట: గిరిజన మ్యూజియం పనులు వేగవంతం చేయాలని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కల్పనాకుమారి ఆదేశించారు. శుక్రవారం స్థానిక పాత పీఎంఆర్‌సీలో జరుగుతున్న మ్యూజియం పనులను టూరిజం శాఖ ఆర్‌డీ పి.శ్రీనివాసరావుతో కలిసి పరిశీలించారు. పనులు పూర్తి చేయడానికి కావాల్సిన నిధులు త్వరితగతిన విడుదల చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆర్‌డీకి సూచించారు. కార్యక్రమంలో పర్యాటక శాఖ జిల్లా మేనేజర్ నారాయణరావు, జాయింట్ మేనేజర్ హరేరామ్, ఈఈ సింహాచలం, ఏఈ మోహన్‌గోపాల్, తదితరులు పాల్గొన్నారు.







సంక్షిప్తంగా...

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

పాలకొండ: నగర పంచాయతీలోని ఎన్‌కే రాజపురం గ్రామానికి చెందిన నీలాపు సురేష్‌కు లక్ష రూపాయల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును స్థానిక ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి శుక్రవారం అందించారు. సురేష్‌కు అనారోగ్యం సోకడంతో వైద్య ఖర్చుల కింద సీఎం రిలీఫ్ ఫండ్ నగదు మంజూరు చేసింది. దీంతో సురేష్ కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు. కౌన్సిలర్ నీలాపు శ్రీనివాసరావు, గోగుల అప్పలనాయుడు, బలగ బలరాం, గుండు శ్రీను, జడ్డు జోగినాయుడు, నీలాపు శంకరరావు, తులసి శివ, జి.కిషోర్, పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు

జియ్యమ్మవలస: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన కార్యదర్శిగా నిమ్మక గోపాల్‌ను పార్టీ అధిష్టానం నియమించడంతో కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణిని ఆమె నివాసంలో శుక్రవారం ఆయన మర్యాదపూర్వకంగా కలిసి, కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ తనపై ఉంచిన బాధ్యతను చిత్తశుద్ధి, నిబద్ధతతో నెరవేరుస్తానన్నారు. రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ఎమ్మెల్యే ఆయనను కోరారు.

అప్రమత్తంగా ఉండాలి..

వీరఘట్టం: విధి నిర్వహణలో పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని పాలకొండ డీఎస్పీ జీవీ కృష్ణారావు సూచించారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎస్సై ఎంవీ రమణ పాల్గొన్నారు.

నాగరకుంటుబాయిలో 'పశువిజ్ఞాన బడి'

కురుపాం: మండలంలోని నాగరకుంటుబాయి గ్రామంలో పశువిజ్ఞాన బడి కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గుమ్మ గ్రామ పశువైద్యాధికారిణి శైలజ చలికాలంలో పశువులకు వచ్చే వ్యాధులు, వాటి నివారణ చర్యలను పాడిరైతులకు వివరించారు. అనంతరం వ్యాధుల బారినపడకుండా 250 మేకలకు వ్యాక్సిన్లు వేశారు.









